# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | 5




## అబ్బురపరచిన త్రివిధ దళాల విన్యాసాలు

- కాకినాడ సముద్ర తీరంలో టైగర్ ట్రయింఫ్

7

## వ్యాపారి కిడ్నాప్ కలకలం





తునిలో గురువారం జరిగిన సభలో యనమలను సత్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. హాజరైన జనం

## విజ్ఞాన గని.. యనమల

- సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు
- సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేత
- కొనియాడిన శాసనసభ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- తునిలో యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ

తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం తునిలో ఘనంగా జరిగింది. శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పలువురు మంత్రులు హాజరైన ఈ సభలో పుస్తకావిష్కరణతో ఫొటో గ్యాలరీలను ఏర్పాటుచేశారు. 7



## తొలి విడత తేలింది!

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే
- 48 గ్రామాల్లో 52,280 మందికి నోటీసులు జారీ
- 21రోజుల్లో నోటీసులకు బదులివ్వాలి
- అభ్యంతరాల స్వీకరణ తర్వాత జేసీ లాగిన్‌కు నివేదిక
- జేసీ ఆధ్వర్యంలో రీ సర్వే నివేదిక తుది ప్రచురణ
- 15 నుంచి 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వే



కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భూముల రీసర్వే క్రతువు కొలిక్కి వస్తోంది. తొలి విడతగా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించి రైతులకు నోటీసులు జారీచేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడత (పైలెట్ ప్రాజెక్ట్)గా 48 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. దీనిలో కాకినాడ జిల్లాలో 15 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 17, తూర్పుగోదావరి జిల్లాలో 16 గ్రామాల్లో రీసర్వేకు ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన తొలి విడత సర్వేలో మూడు నెలలపాటు అంటే జనవరి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు అధికార బృందాలు పాల్గొన్నాయి. 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించి సర్వే చేశారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ భూముల విస్తీర్ణాన్ని బట్టి నాలుగు బృందాలుగా విభజించారు. ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్ఏలు ఒక బ్లాక్‌ను సర్వే చేశారు. ఇలా బృందాలు నిత్యం రీసర్వేలో పాల్గొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆదరాబాదరాగా భూముల సర్వే చేశారు. ఈ నేపథ్యంలో భూముల విస్తీర్ణం తగ్గిందని, హద్దులు మార్చేశారని, హక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయని పెద్దఎత్తున రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్రప్రభుత్వం భూముల రీసర్వేకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూముల రీసర్వే నిర్వహించారు.

### తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడతలో 16 గ్రామాల్లో భూముల రీసర్వే చేశారు. 19 వేలమంది రైతులకు నోటీసులు జారీచేశారు. క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దు కొలిచి ఏ మేరకు హక్కు పత్రాల్లో ఉన్నాయో గుర్తించారు.



కరపలో రీసర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

### కాకినాడ జిల్లాలో...

కాకినాడ జిల్లాలో తొలి విడతలో 15 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో వేట్లపాలెం, కోలంక, కుమారపురం, పటవల, యల్లమిల్లి, జె.కొత్తూరు, ఎస్.తిమ్మాపురం, బోదవరం, కట్టమూరు, పి.జగన్నాథపురం, ఆర్.వెంకటపురం, శంఖవరం, కృష్ణపురం, భద్రవరం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో వ్యవసాయ పొలాలను రెవెన్యూ బృందాలు రీసర్వే నిర్వహించాయి. ఇటీవల 27 వేల మందికి 92 నోటీసులు జారీచేశారు. మరో 21 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు.

### అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొలి విడతలో 17 గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహించారు. దీనిలో జొన్నాడ, వాడపల్లి, కొడగట్లపల్లి, ఓడరేవులపల్లి, భీమక్రోసుపాలెం, ముమ్మిడివరప్పాడు, అప్పన్నరామునిలంక, మట్టపర్రు, గాడిలంక, పశువులంక, ఉప్పలగుప్తం, ఎంట్రికోన, కందికుప్ప, నందంపూడి, వానపల్లి గ్రామాల్లో రీసర్వే నిర్వహించారు. 5,280 మంది రైతులకు 92 నోటీసులు జారీచేశారు.

### తొలి విడత రీసర్వే నివేదిక

తొలి విడత భూముల రీసర్వే నోటీసులకు అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత నివేదిక తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ల లాగిన్‌కు వెళుతుంది. జాయింట్ కలెక్టర్ పరిశీలించిన తర్వాత ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. అక్కడ ఎలాంటి అభ్యంతరాలు లేని రీసర్వే నివేదికను తుది ప్రచురణ చేసి ఆమోదిస్తారు. ఈ నేపథ్యంలో రైతులు ఎంతోకాలంగా పరిష్కారం కాని భూముల హద్దులు, దొర్లిన తప్పుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించనుంది.

### 15 నుంచి రెండో విడత..

ఈనెల 15 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వేకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో కాకినాడ జిల్లాలో 14 గ్రామాల్లో, కోనసీమ జిల్లాలో 15 గ్రామాల్లో, తూర్పుగోదావరి జిల్లాలో 17 గ్రామాల్లో రీసర్వేకు సర్వం సిద్ధమైంది. రెవెన్యూ బృందాలు, సర్వేయర్ల బృందాలను అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

### దరఖాస్తులకు పరిష్కారం

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు నిండా మునిగారు. ఈ పది నెలల కాలంలో మూడు జిల్లాల్లో నిర్వహించిన గ్రామసభలకు, కలెక్టరేట్‌లకు వేలాది సంఖ్యలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అధికారులూ తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ప్రభుత్వం రీసర్వేకు ఆదేశించడంతో రైతులకు ఊరట కలగనుంది.

## వ్యవసాయానికి డ్రోన్ టెక్నాలజీ ఎంతో ఉపయుక్తం

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ జైచంద్రగాంధీ



ఎ.వేమవరప్పాడులో డ్రోన్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీ వ్యవసాయరంగానికి ఎంతో ఉపకరిస్తుందని, డ్రోన్ల ద్వారా పంట పర్యవేక్షణ, పురుగుమందుల పిచికారీ, నీటిపారుదల నిర్వహణ, విత్తనాలు వెదజల్లడం వంటివి సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సాయినాథ్‌జైచంద్రగాంధీ అన్నారు. ఈనెల 7 నుంచి 11 వరకు కర్నూలు ట్రిపుల్ ఐటీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ సాంకేతిక ప్రతినిధులు వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై క్షేత్రస్థాయిలో డ్రోన్లను ప్రయోగాత్మకంగా ఎ.వేమవరప్పాడు పరిధిలో సాగు క్షేత్రాల్లో ఎగురవేశారు. నీటిపారుదల వ్యవస్థను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించి అవసరమైన చోట్ల నీటిని సమగ్రంగా అందించేందుకు ఉపకరిస్తాయన్నారు. డ్రోన్ల ద్వారా ఎన్నో పనులు సాగించవచ్చని చెప్పారు. మహిళా స్వయం సహాయక బృందాలకు కేంద్ర ప్రభుత్వం డ్రోన్ల సాంకేతికతను అందించి వారిని ప్రోత్సహిస్తుందన్నారు. నిఘా, డేటా సేకరన నుంచి భద్రత వరకు వ్యవసాయ క్షేత్రాన్ని నిర్వహించే సామర్థ్యాన్ని ఈ టెక్నాలజీ ద్వారా మెరుగు పరుచుకోవచ్చునని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీ బృందంతో కూడిన సభ్యులతో డ్రోన్ పనితీరును పరిశీలించారు.

## రమ్మీ.. జీవితం డమ్మీ!




- పొలం అమ్మి ఆన్‌లైన్ రమ్మీలో కోటీ 40 లక్షలు పోగొట్టుకున్న వైనం
- అప్పై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- యథేచ్ఛగా రమ్మీ ఆన్‌లైన్ గేమ్.. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేకాటే
- బానిసలైపోతున్న యువతరం.. ఇదో రకం లూటీ
- రోడ్డునపడుతున్న కుటుంబాలు.. నియంత్రణ సాధ్యమేనా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : అతడిది కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రామన్నపాలెం. ఉప్పాడ సెంటర్లో వాహనాల స్పేర్‌పార్టుల వ్యాపారం. తండ్రికి ఉన్న 90 సెంట్ల పొలాన్ని రూ.కోటి36లక్షలకు విక్రయించాడు. ఈ సొమ్ముతో వేరేచోట పొలం కొనాలి. కానీ ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌లో ఈ మొత్తం సొమ్ముతోపాటు మరో రూ.4లక్షలు సైతం దఫదఫాలుగా ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో ఈనెల 8న పురుగుమందు తాగేశాడు. వెంటనే కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అప్పుడు అసలు విషయం వెలుగుచూసింది. ఈ తరహాలోనే ఆన్‌లైన్ రమ్మీ క్యాష్ గేమ్స్‌లో ఆడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నవారు, ఇళ్లు, పొలాలు అమ్మి మరీ ఆడిన వారు, కళాశాలల్లో ఈ గేమ్‌కు బానిసలై చదువులు అటకెక్కినవారు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. నిజానికి పేకాట ఆడటం నేరం. ఎక్కడైనా పేకాట ఆడితే వారిని పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. కానీ అదే పేకాట ఆన్‌లైన్‌లో ఆడితే కేసులు ఉండవు. ఇదే అదనుగా సరదాగా ఆడుకున్న రమ్మీ ఆటను పెద్ద జూదంగా మార్చేశారు. ఇంట్లో, ఆఫీసుల్లో, బస్టాండుల్లో, రెస్టారెంట్లలో, పార్కుల్లో, ఇంట్లో ఖాళీగా ఉన్న సమయంలో రాత్రి పగలూ తేడా లేకుండా ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట ఆడేస్తున్నారు. వీటిని నియంత్రించే పరిస్థితి కూడా లేదు. వాస్తవానికి పేకాట ఆన్‌లైన్‌లో ఆడటం కూడా అధికారికంగా కుదరదు. కానీ కొంతమంది ఈ పేకాటను ఎక్కడో గోవా, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, ముంబై, కలకత్తా, పంజాబ్, ఢిల్లీ వంటి ప్రాంతాల నుంచి ఆపరేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో రమ్మీని ఆడిస్తూ కోట్లాది రూపాయలు లాగేస్తున్నారు. రమ్మీలో తొలుత డబ్బులు వచ్చేలా చేసి అలవాటు చే



యడం ద్వారా ఆటగాళ్లకు వలవిసురుతారు. ఈ వలలో పడ్డ ఆటగాడు విలవిల కొట్టుకుని చివరికి అప్పులు పాలై ఊరువదిలి పెట్టి పారిపోయే పరిస్థితి. ముఖ్యంగా యువత ఈ రమ్మీ గేమ్‌ల వైపు ఆసక్తి చూపడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో తొలుత చిన్న ప్రారంభమైనా క్రమేపీ లక్షల్లోకి ఈ గేమ్ వెళ్లిపోతుంది. దీనికి మళ్లీ కొంతమందితో ప్రమోట్ చేయించడంతో చాలామంది యువత ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. యువతతోపాటు పెద్దవాళ్లు కూడా ఈ ఆటలకు బానిసలు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఆన్‌లైన్‌లో రమ్మీ పేకాట పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతుంది. కొంతమంది సాముహాన్ని ఒకచోట కేంద్రీకృతం చేసి వారు కార్డులను వారికి ఓపెన్‌గా చూసుకుని గేమ్ ఆడి దానిని ఆ గ్యాంగ్‌లోని వారే షో కొట్టేవిధంగా వ్యూహాత్మకంగా ఇది నడుస్తుంది. దీనివల్ల వివిధ ప్రాంతాల నుంచి ఆడేవారంతా నష్టపోతారు. నగదు అంతా ఈ గేమ్ నిర్వహించే ముఠాకే వెళ్లిపోతుంది. దీన్ని ఆధారాలతో పట్టుకునే వారే ఉండరు. ఆన్‌లైన్ పేకాటలు, బెట్టింగ్ యాప్‌లపై ఎటువంటి ఫిర్యాదు ఉండడంలేదు. దీనికి కారణం ఆన్‌లైన్ జూదంలో సొమ్ములు పోగొట్టుకున్నామని చెప్పుకోలేరు. ఒకవేళ చెబితే తొలుత చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు కాబట్టి దాంతో విషయం వెలుగుచూసే అవకాశం ఉండదు. ఈ తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మరెన్నో కుటుంబాలు రోడ్డునపడతాయి.

## రానున్న రోజుల్లో 13లక్షల మెట్రిక్ టన్నుల
# ఇసుక నిల్వలు సిద్ధం



శాండ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- ఐదు సెమీ మెకనైజ్డ్ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు
- ఈ నెలాఖరు నాటికి టెండర్లు పూర్తి
- శాండ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో భవన నిర్మాణ రంగానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కోనసీమ జిల్లాలో 13లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను స్టాక్ యార్డుల్లో సిద్ధం చేయనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి శాండ్ కమిటీ సమావేశానికి చైర్మన్ హోదాలో ఆయన అధ్యక్షత వహించారు. జిల్లావ్యాప్తంగా ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు వచ్చాయని, త్వరలో ఇసుక తవ్వకాల నిర్వహణకోసం టెండర్లు ఖరారు చేసి ఈనెల 30న నాటికి తవ్వకాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సెమీ మెకనైజ్డ్ ఇసుకరీచ్‌ల ఆపరేషన్‌కోసం పక్క జిల్లాల్లో అమలవుతున్న విధి విధానాలను అధ్యయనం చేస్తూ ఈనెల 16 నాటికి కార్యాచరణ నివేదికను అందజేయాలని జేసీని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం పనిచేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందాలను మరింత బలోపేతం చేస్తూ అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను నిరోధిస్తామన్నారు. సెమి మెకనైజ్డ్‌రీచ్‌ల కమిటీల్లో సభ్యులుగాఉన్న డ్వామా పీడీ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, జలవనరులశాఖ ఇంజనీర్, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా ఆడిటర్లు మెకనైజ్డ్ రీచ్‌ల ఆపరేషన్ల విధివిధానాలను నిష్పక్షపాతంగా రూపొందించాలని సూచించారు. ఈనెల 17న టెండర్లు పిలిచి 22న వాటిని ఫైనలైజ్ చేస్తామన్నారు. 16న సెమీమెకనైజ్డ్ రీచ్‌ల కార్యకలాపాలపై కమిటీ సభ్యులతో సమావేశమై విధివిధానాలు రూపొందిస్తామన్నారు. జిల్లాలో ఐదు ఇసుక రీచ్‌ల్లో 21లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించామని, కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, అమలాపురంలో స్టాక్ యార్డుల ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. జాతీయ రహదారి 16కి దగ్గరగా 8లక్షలు, అమలాపురం స్టాకుయార్డులో 3లక్షలు, గౌతమీ ప్రాంతంలో 3లక్షల మెట్రికల్ టన్నుల ఇసుకను నిల్వ చేస్తామన్నారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, మైన్స్ ఏడీ వంశీధర్‌రెడ్డి, హెడ్‌వర్క్స్‌ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పద్మనాభం పాల్గొన్నారు.

## ప్రమాదపు అంచుల్లో..



కొమరగిరిపట్నం-రామేశ్వరం రోడ్డులో శిథిలస్థితిలో బెండానార్త్ అవుట్‌ఫాల్ స్లూయిస్

- శిథిలావస్థలో బెండానార్త్ అవుట్‌ఫాల్ స్లూయిస్
- కూలితే తీర గ్రామాల రాకపోకలు బంద్
- నేరుగా ఉప్పునీరుతో ముంపు బెడద

అల్లవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలకుల హయాంలో 70 ఏళ్ల క్రితం నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారులో బెండానార్త్ అవుట్‌ఫాల్ స్లూయిస్ శిథిలమై గోడలు దెబ్బతిని ప్రమాదపు అంచుల్లో కూలడానికి సిద్ధంగా ఉంది. రామేశ్వరం మొగ ద్వారా సముద్రపు ఉప్పునీరు నేరుగా పంటపొలాలకు రాకుండా పంచనది డ్రెయిన్‌ను కలుపుతూ షట్టర్లతో బ్రిటీష్ హయాంలో బెండానార్త్ అవుట్‌షాల్ స్లూయిస్ నిర్మించారు. ఇది ఏ క్షణాన్నైనా శిథిలమై కూలితే ఎస్.రామేశ్వరంతో సహా తీర గ్రామాల రాకపోకలు స్తంభించే ప్రమాదం ఉంది. పాఠశాలలకు విద్యార్థుల బస్సులు, నీళ్ల టిన్నులు తరలించే లారీలు, ఆటోలతోపాటు వందలాదిగా మోటారుసైకిళ్లు ఈ స్లూయిస్‌పైనే రాకపోకలు సాగిస్తుంటాయి. డ్రైనేజీశాఖ ఆధ్వర్యంలో ఉప్పునీరు రాకుండా నిర్మించిన స్లూయిస్ తలుపులు ఊడిపోయి గోడలు దెబ్బతిని ప్రమాద భరితంగా మారింది. ఆటుపోట్లకు ఉప్పునీరు రాకుండా ఆపరేటింగ్ విధానంతో నిర్మించిన ఇది శిథిలావస్థకు చేరింది. రామేశ్వరం మొగ సమీపంలో సముద్రపు ఉప్పునీరు ప్రవాహానికి దగ్గరలో నిర్మించిన స్లూయిస్ ప్రమాదభరితంగా మారింది. తుమ్మలపల్లి, కొమరగిరిపట్నం గ్రామాలకు చెందిన వెయ్యి ఎకరాల ఆయకట్టు మురుగునీరు క్రమబద్ధీకరణకు అప్పట్లో దీన్ని నిర్మించారు. ఏటా ప్రతిపాదనలు తప్ప ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ అవుట్‌ఫాల్ స్లూయిస్ అభివృద్ధిని పట్టించుకున్న నాథుడు లేడని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను పునర్నిర్మించాలి
**-దాట్ల గోపీరాజు, డీసీ చైర్మన్, కొమరగిరిపట్నం**

బ్రిటీష్ హయాంలో నిర్మించిన బెండా నార్త్ అవుట్‌ఫాల్ స్లూయిస్ పూర్తిగా పాడై శిథిలమైంది. వెయ్యి ఎకరాల ఆయకట్టును దీనిపైనే ఆధారపడి సాగుచేస్తున్నారు. ప్రమాద భరితంగా, కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను తక్షణమే తొలగించి పూర్తిగా పటిష్టంగా పునర్నిర్మించాలి.

### రూ.94లక్షలతో ప్రతిపాదనలు పంపాం
**-ఎంవీవీ కిశోర్, డ్రెయిన్స్ డీఈఈ**

బెండానార్త్ అవుట్‌ఫాల్ స్లూయిస్ శిథిలమైంది. ఉప్పునీరు దింపుకునేందుకు రాకుండా షట్టర్లు ఎత్తే విధానంతో దీన్ని నిర్మించారు. స్లూయిస్ రెగ్యులేటర్ కం రోడ్డు విధానంలో దీన్ని పునర్నిర్మించేందుకు నాలుగుసార్లు ప్రతిపాదనలు పంపాం. షట్టరింగ్ విధానంతో పునర్నిర్మాణానికి రూ.94లక్షలతో ప్రతిపాదనలు పంపాం.

### భూముల క్రమబద్ధీకరణకు డిసెంబరు 31 గడువు: జేసీ

అమలాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భూముల క్రమబద్ధీకరణ పథకం 2025 కింద గృహ నివాస యూనిట్ల అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఈఏడాది డిసెంబరు 31లోగా దరఖాస్తు చేసుకుని హక్కులు పొందాలని జేసీ టి.నిషాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలి: ఎంపీ హరీష్



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ ద్వారా ప్రతిఇంటికీ రక్షిత మంచినీరు అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై గ్రామీణనీటిసరఫరాశాఖ ఉన్నతాధికారులతో అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ గురువారం తన కార్యాలయంలో సమీక్షించారు. వేసవిలో ఎవరూ నీటికి ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ ఉదాసీనతవల్ల గ్రామాల్లో తాగునీటిఇబ్బందులతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, చంద్రబాబు హయాంలో అటువంటి పరిస్థితులురాకుండా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. గ్రామీణనీటిసరఫరాశాఖ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.




టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు జనతా వస్త్రాల పథకంతో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించారు. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం చేనేత ముడి సరుకులైన చిలపనూలుపై 20 నుంచి 40శాతం రాయితీ ఇచ్చింది. అంతేకాదు మిల్లు వస్త్రాల పోటీని తట్టుకునేందుకు చేనేత వస్త్ర ఉత్పత్తులపై 20 నుంచి 30శాతం రాయితీ ఇచ్చి విక్రయాలు చేసుకునే సదుపాయం కల్పించారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేత సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం పాడేసింది. నేతన్న నేస్తంతో చేతులు దులుపుకుంది. దాంతో చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు కోట్ల రూపాయల మేర బకాయిలు విడుదల చేయకుండానే ఐదేళ్లూ గడిపేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేత కార్మికుల్లో ఆశలు చిగురించాయి. వారి ఆశలను అడియాశలు చేయకుండా గతంలో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఒక్కో పథకాన్ని తిరిగి అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది.

# చేనేత రంగానికి జవసత్వాలు

**చేనేత కార్మికుల సంక్షేమానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం**

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

నేతన్నల సృజనాత్మకతతో బయటకు వచ్చిన జమదానీ చీరలకు లభించిన గుర్తింపు అంతా ఇంతా కాదు. ఏకంగా పేటెంట్ హక్కు దక్కించుకున్న ఘనత దీనిదే. ఉప్పాడలో తయారవుతున్న జమదానీ చీరలను ఇప్పుడు కోనసీమ జిల్లాలోని పలు చేనేత గ్రామాల్లో సైతం నేస్తున్నారు. హసన్‌బాద్‌లో తయారయ్యే దుప్పట్లు, తువ్వాళ్లు, పులగుర్తలో ఖాదీ వస్త్రాలు, షర్టింగ్ క్లాత్స్, కె.జగన్నాథపురం, విలసవిల్లి గ్రామాల్లో పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, బండారులంక, జగ్గన్నపేట, కేశనపల్లి, మండపేట, మోరి, ముమ్మిడివరం, పెనుమల్ల, పుల్లేటికుర్రు, ఆదివారపుపేట, అంగర, రాయవరం తదితర చేనేత గ్రామాల్లో తయారయ్యే చేనేత బుటా నేత చీరలు, జాకార్డ్, లుంగీలు, తివాచీలతో పాటు దివాన్‌సెట్లు, పిల్లో కవర్లు, కుప్పడం పంచెలు మంచి గుర్తింపు పొందాయి. రూ.300 నుంచి రూ.3లక్షలు విలువ చేసే చేనేత చీరలను తయారు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై జిల్లాలోని ఒక్కో చేనేత సహకార సంఘం లక్షలాది రూపాయల నుంచి కోట్ల రూపాయల మేర అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నాయి. వారిని ఆదుకుని తిరిగి చేనేత రంగానికి జవసత్వాలు నింపే విధంగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

## జిల్లాలో 5వేల కుటుంబాలకు పైబడి ఉచిత విద్యుత్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనుంది. ఇప్పటికే ప్రభుత్వం జీవో నెం.44 జారీ చేసింది. పవరలూమ్‌లకు 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తారు. రెక్కాడితేగానీ డొక్కాడని నేత కుటుంబాలకు విద్యుత్ చార్జీల భారం ఇకపై ఉండదు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసింది. అంతకుముందు చంద్రబాబు ప్రభుత్వం చేనేత మగ్గం ఉన్న కుటుంబాలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ అందించింది. ఇప్పుడు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు అనుబంధ వృత్తులవారికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 5వేలకు పైగా దరఖాస్తులు అందినట్టు ఆ శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. త్వరలోనే అర్హులైన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో 23 చేనేత సహకార సంఘాల పరిధిలో 6,150 మంది సభ్యులు ఉన్నారు. వీరితో పాటు మాస్టర్ వీవర్ల వద్ద 1,252 మంది కార్మికులు ఉన్నట్టు చేనేత అధికారులు గుర్తించారు. ఉచిత విద్యుత్ కోసంమరిన్ని దరఖాస్తులు అందే అవకాశం ఉందన్నారు.

## జిల్లాకు త్వరలో రూ.90 లక్షల త్రిఫ్ట్ ఫండ్ నిధులు

**కె.పెద్దిరాజు**
**చేనేత-జౌళి శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా**



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చేనేత సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ నెలలో రూ.1.10 కోట్లమేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల కానున్నాయి. గత ప్రభుత్వంలో త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి ప్రత్యేకంగా కోనసీమ జిల్లాలోని 23 చేనేత సహకార సంఘాలకు సంబంధించి అత్యధికంగా రూ.90లక్షలు విడుదల కానున్నాయి. త్వరలోనే ఖజానా శాఖ కార్యాలయం నుంచి ఇవి రానున్నాయి. కార్మికుని వేతనం రూ.100 ఉంటే త్రిఫ్ట్ ఫండ్ కింద చేనేత సంఘాలు రూ.8 జమ చేస్తాయి. తిరిగి ఆ కార్మికునికి రూ.16 జతకలిపి మొత్తంగా రూ.24 చొప్పున చెల్లిస్తారు. అంటే ఒక కార్మికుడు నెలలో రూ.3వేలు వేతనం పొందితే అతనికి అదనంగా రూ.720 దక్కుతుంది.

## రాయితీ బకాయిలు విడుదల చేయాలి

**చింతా శంకరమూర్తి, మాజీ జడ్పీటీసీ, బండారులంక**



జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు 20 నుంచి 40 శాతం చిలపనూలు సబ్సిడీపై రూ.3.55 కోట్లు బకాయిలు ఉన్నాయి. 20 నుంచి 30 శాతం చేనేత వస్త్రాల రిబేటు పథకంలో రూ.2.81 కోట్లు బకాయిలు ఉన్నాయి. పావలా వడ్డీ రాయితీ కింద రూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్ల బకాయిలు జిల్లాలోని చేనేత కార్మికులకు, సహకార సంఘాలకు చెల్లించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నీ విడుదల చేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలి.

## మార్కెటింగ్ సదుపాయం మెరుగుపరచాలి

**దొంతంశెట్టి సత్యప్రకాష్, లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్**



చేనేత సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఇప్పటికే పలు సంఘాలు ఆన్‌లైన్‌లో వస్త్ర వ్యాపారానికి శ్రీకారం చుట్టాయి. ఈ విధానాన్ని ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలి. చేనేత వస్త్ర ఉత్పత్తుల విక్రయాలను కేవలం ఆప్కోకు మాత్రమే పరిమితం చేసే విధానానికి స్వస్తి పలకాలి. మరమగ్గాల ధాటికి తట్టుకునేలా చేనేత వస్త్రాలపై 30 శాతం రాయితీ ఇవ్వాలి. అంగన్వాడీలు సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి అమలు చేస్తున్న డ్రెస్‌కోడ్‌లో భాగంగా చేనేత వస్త్రాలనే వినియోగించేలా ప్రభుత్వం చొరవ చూపాలి.



బండారులంకలో అల్లు పడుతున్న కార్మికులు

# నేతన్నకు చంద్రన్న చేయూత

**200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ ప్రకటనపై హర్షాతిరేకాలు**

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. ఈ క్రమంలో చేనేతలకూ చేయూత ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఉన్న వంద యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతామని స్పష్టం చేశారు. పవర్ లూమ్‌కు కూడా 500 యూనిట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. వీటిని అమలు చేస్తామని సీఎం ప్రకటించడంతో కాకినాడ జిల్లాలోని చేనేత కుటుంబాలు చంద్రబాబుపై అభినందనల జల్లు కురిపించాయి.

## ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగం

**కాకి మంగ, చేనేత కార్మికురాలు, వాకతిప్ప, కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా**



ఇద్దరు పిల్లలతో కుటుంబం ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయింది. మరోవైపు అప్పటి పలు రకాల పరిస్థితుల్లో చేనేత రంగంతో పాటు నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ నేపథ్యంలో చేనేత రంగ అభివృద్ధిలో భాగంగా ఉచిత విద్యుత్‌ను ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది.

## మాట మార్చలేదు... మడమ తిప్పలేదు

**ఇంధన లోవబాబు, చేనేత కార్మికుడు**



ఎన్నికల హామీలు నెరవేర్చే క్రమంలో కూటమి ప్రభుత్వం మాట మార్చలేదు, మడమ తిప్పలేదు. నేతన్నల నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్‌లూమ్‌కి 500 యూనిట్లు అందిస్తున్నట్టు ప్రకటించడం ఆనందదాయకం.

## సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

**పొన్నగంటి సత్యనారాయణ, అఖిల భారత పద్మశాలీ సంఘం కార్యదర్శి, కాకినాడ పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు**



చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చుకోవడం పట్ల నేతల కుటుంబాలన్నీ సంతోషంగా ఉన్నాయి. చేనేతల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందరూ కృతజ్ఞతలు చెప్తున్నారు.

# పెరుగులంకలో చెరువుల తవ్వకాలపై విచారణ



విచారణ చేస్తున్న తహశీల్దార్ విజయశ్రీ

ఐ.పోలవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరి పెరుగులంక భూముల్లో కొనసాగుతున్న రొయ్యల చెరువుల తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం, ముమ్మిడివరం, తాళ్లరేవు, కె.గంగవరం మండలాల పరిధిలో గోదావరి చెంత ఉన్న పెరుగులంక భూముల్లో ఆక్వా చెరువుల తవ్వకాలు జరుగుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. పెరుగులంక భూముల్లో అక్రమంగా చెరువులు తవ్వుతూ నిబంధనలకు విరుద్ధంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ పశువుల్లంకకు చెందిన చీకురుమిల్లి తాతారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం పెరుగులంక భూముల్లో పర్యటించి వివరాలు సేకరించారు. తహశీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డిప్యూటీ తహశీల్దార్ మహాలక్ష్మీనాయుడు, మండల సర్వేయర్ మహేష్‌తో పాటు వీఆర్వోల బృందం ఆక్వా చెరువుల తవ్వకాలను పరిశీలించారు. పశువుల్లంక, కొమరగిరి గ్రామాల సరిహద్దుల్లో జరుగుతున్న చెరువుల తవ్వకాలకు రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. మండల పరిధిలో సుమారు 427 ఎకరాలు పెరుగులంక భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ భూమిలో చెరువుల తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం విచారణ చేపట్టింది. ముందుగా ఆయా మండలాల పరిధిలో ఉన్న పెరుగులంక భూములను గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.

# జీడిపప్పు కార్మికులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- మోరి, మోరిపోడులో జీడిపప్పు పరిశ్రమల సందర్శన



మోరి ఫ్యాక్టరీలో జీడిపప్పుని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అందరికీ మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విద్యుత్ సమస్యలతో మోరి, మోరిపోడులో నష్టపోయిన జీడిపప్పు పరిశ్రమలను, కార్మికులను ఆయన సందర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరి జీడిపప్పు పరిశ్రమపై పరిసర గ్రామాల కార్మికులు ఆధారపడి ఉన్నారని, జీడిపప్పును కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రభుత్వపరంగా చేయూతనిచ్చే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. గత రాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బ్రేకర్లు ఫెయిల్ అయి విద్యుత్‌లో హెచ్చుతగ్గుల వల్ల జరిగిన కారణంగా సుమారు రూ.5-రూ.6 లక్షలు నష్టం జరిగిందని, పలు ఫ్యాక్టరీల్లో మోటార్లు కూడా కాలిపోయినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. మోరి, మోరిపోడులోని 12 జీడిపప్పు పరిశ్రమలకు చిన్నతరహా పరిశ్రమల ద్వారా ఉండే రాయితీలు వచ్చేవిధంగా సంబంధిత మంత్రితో మాట్లాడతానన్నారు. ఈ పరిశ్రమలకు విద్యుత్ రాయితీ పై మంత్రితో చర్చిస్తానన్నారు. ఫ్యాక్టరీ యజమాని ముప్పర్తి సుబ్బారావు జరిగిన నష్టం తీరును ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎల్‌ఐ ప్రసాద్, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, గుబ్బల పణి, పినిశెట్టి బుజ్జి, రావూరి నాగు, బళ్ల రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ట్రాన్స్‌కో ఏడీపై సీఎంతో మాట్లాడా

రాజోలు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు సుదీర్ఘ కాలం నుంచి పనిస్తున్న ఎలక్ట్రికల్ ఏడీఈ పనితీరే కారణమని ఎమ్మెల్యే వరప్రసాద్ అన్నారు. అతను సుదీర్ఘ కాలం నుంచి ఉండడంతో పాటు సరిగా స్పందించకపోవడంతో ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. అతని స్థానంలో కొత్తవారిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎండీ, ఎస్ఈలతో మాట్లాడారు.

# వెంకన్న ఆలయంలో కన్నుల పండువగా సదస్యం



వెంకన్న ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం స్వామివారికి మేలుకొల్పు, తీర్థపు బిందెతో గోదావరి జల సంగ్రహణ, నీత్యార్చన, నిత్యమహోమాలు, దిగ్దేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ద్రవిడ వేద పారాయణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం విశ్వక్సేన పూజ, అష్టదిపాలకన ఆరాధన, సదస్యం వైభవంగా నిర్వహించారు. చతుర్వేద పండితులతో మహాదాశీర్వచనం కన్నుల పండువగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో ప్రధాన హోమాలు, దిగ్దేవత బలిహరణ జరిపారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ఆరోగ్య ఉపశాఖాధికారిణి డాక్టర్ సుమలత, ఎంపీడీవో వెంకటరామన్, రావులపాలెం ఆర్టీసీ డీఎం రమణ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారందరికీ పండితులు శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందించారు.



ఉత్సవమూర్తులు



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు స్వామివారి శేషవస్త్రం సమర్పించిన దృశ్యం

## నేడు చేబ్రోలులో గుర్రాల ప్రదర్శన పోటీలు



పోటీలకు తరలివచ్చిన గుర్రాలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు జరగనున్నాయి. చేబ్రోలు బైపాస్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం చెంతనే ఉన్న రోడ్డులో సీతారామస్వామి ఆలయ కమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గుర్రాలు ఇప్పటికే తరలి వచ్చాయి. చేబ్రోలులో తొలిసారి జరుగుతున్న పోటీలు కావడంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీల్లో తొలి పది స్థానాలు సాధించిన గుర్రాలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

## జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జూహితకు గోల్డ్‌మెడల్



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్రీడా కీర్తి దేశవ్యాప్తంగా ఇనుమడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరానికి చెందిన విద్యార్థి జూహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటి గోల్డ్‌మెడల్ సాధించింది. మణిపూర్‌లోని ఇంపాల్ నగరంలో గురువారం జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు అండర్-17 విభాగంలో రాజమహేంద్రవరంలోని లాలాచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థిని జూహిత గుణ గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే జూహిత గుణ ప్రతిభను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

# సామర్లకోట మీదుగా ప్రత్యేక రైళ్లు

**చర్లపల్లి-నహరలగున్ మధ్య ఆరు ఎక్స్‌ప్రెస్‌లు**

సామర్లకోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవు రోజుల్లో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైలు ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ప్రయాణికులకు మరింత సేవలందించేందుకు ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను చర్లపల్లి-నహరలగున్ మధ్య సామర్లకోట మీదుగా వివిధ ప్రాంతాలకు అందుబాటులోకి తెస్తున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని రాత్రి ఆంధ్రజ్యోతి సేకరించింది. 07046 నంబరు గల చర్లపల్లి-నహరలగున్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12,19,26లలో ప్రతీ శనివారం చర్లపల్లి నుంచి ఉదయం 8.40 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం స్టేషన్‌కు సాయంత్రం 5గంటలకు చేరుకుని సామర్లకోటకు 6.05గంటలకు చేరుతుంది. తిరిగి ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం నార్త్, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెరహమ్‌పూర్, బాలూగాన్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, జైపూర్ కోయింజహార్ రోడ్, భద్రక్, బాలేశ్వర్, ఖరగపూర్, అండుల్, డంకుని, బార్ద్‌దమన్, బోలాపూర్ శాంతినికేతన్, రాంపూర్‌హాల్ట్, మాల్దా టౌన్, కిషన్‌గంజ్, అలూబరి రోడ్, న్యూ జలపాయిగురి, దూప్‌గురి, న్యూకోచ్‌బెహరి, న్యూ అలిపురదార్, కొక్రాజిహార్, న్యూ బొంగాయ్‌గాన్, బారాపేట రోడ్, రంగియా, ఉదల్‌గురి, రంగపారా నార్త్, హారముతిల మీదుగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని నహరలగున్ స్టేషన్‌కు సోమవారం సాయంత్రం 4 గంటలకు చేరుతుంది. 07047 నంబరు గల అరుణాచల్ ప్రదేశ్ నహరలగున్ నుంచి చర్లపల్లి మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15, 22,29లలో నహరలగున్ నుంచి ప్రతీ మంగళవారం మధ్యాహ్నం 13.00గంటలకు బయలుదేరి సామర్లకోటకు మధ్యాహ్నం 10.10గంటలకు చేరుకుని కాకినాడకు రాజమహేంద్రవరంనకు 10.58గంటలకు చేరుతుంది. చర్లపల్లి స్టేషన్‌కు గురువారం రాత్రి 9.30 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైలులో సెకండ్ ఏసీ-1, థర్డ్ ఏసీ-5, స్లీపర్ క్లాస్-10, ఎల్ఎస్ఎల్ఆర్డీ-1, ఈవోజీ-1 చొప్పున 18 ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణికులకు సేవలందించనుంది.

ఈ రైళ్లల్లో ప్రయాణించే వారు రిజర్వేషన్ టిక్కట్లు తదితర సమాచారం కోసం ఆయా సమీప స్టేషన్లలోను బుకింగ్ కార్యాలయాలలోను సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన లేఖలో తెలిపారు.

## ఏమ్మా.. ఎలా ఉన్నారు?



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆవ రోడ్డులో ఏకలవ్య బాలల వసతిగృహం, బొమ్మూరులోని బాలికల వసతి గృహాలను డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ గురువారం సందర్శించారు. వసతి పొందుతున్న వారికి అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. వారికి సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం అందించాలని, వైద్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ వహించవద్దని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి యోగక్షేమాలను ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా, న్యాయ సహాయం అవసరమైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీఎల్ఎస్ఏ తరఫున తగు చర్యలు తీసుకోడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

## శృంగారవల్లభుడి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



పెద్దాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతిలోని శృంగారవల్లభ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సుమారు 500 మంది ముత్తయిదువులు ఉచిత సామూహిక కుంకుమార్చన చేశారు. వారికి దేవస్థానం తరపున పూజా సామగ్రి ఉచితంగా అందజేసి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమనారాయణాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, అంజనీకుమార్, సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విజ్ఞాన గని 'యనమల'



సభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

- సుదీర్ఘ రాజకీయ నేతగా ఎన్నో విలువలు నెలకొల్పారు
- అధిరోహించిన పదవులన్నింటికీ వన్నెతెచ్చిన నేత
- సంక్షోభాలు, ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని నేతగా పేరొందారు
- యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభలో కొనియాడిన స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- సభకు తరలివచ్చిన నేతలందరికీ కృతజ్ఞతలు : యనమల



సభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే దివ్య



పాటలు పాడుతున్న వందేమాతరం శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

కాకినాడ/తునిరూరల్ ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ సీనియర్ నేత యనమల రాజకీయ విజ్ఞాన గని. అమరావతి నుంచి అమెరికా వరకు అనేక అంశాలను నిత్య విద్యార్థిలా చదువుతూ అందరికీ వివరిస్తూ ఎంతోఖ్యాతి గడించారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు, మంత్రులకు యనమల రాజకీయ గురువు. 42ఏళ్ల రాజకీయాల్లో ఆయన చూడని పదవులు, హోదాలు లేవు. ఇన్నేళ్ల రాజకీయాల్లో ఏరోజు గర్వపడడం కానీ, కుంగిపోవడం కానీ ఎరుగని నాయకుడు. సంక్షోభాలు, సమస్యలు ఎదురైనా చెక్కుచెదరకుండా శ్రీకృష్ణుడిలా చిరునవ్వుతూ కనిపించే యనమల రాజకీయ రారాజు' అని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, అచ్చెన్న, నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు కొనియాడారు. కాకినాడజిల్లా తునిలో యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలిరావడంతో తుని పట్టణంలో సాయివేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భారీ బాణసంచా మిరిమిట్ల మధ్య సభ పండుగ వాతావరణంలో కళకళలాడింది.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇతర నేతలతో కలిసి యనమల 42ఏళ్ల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకుముందు అక్కడే ఏర్పాటు చేసినయనమల ఫొటోగ్యాలరీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. గ్యాలరీలో యనమల చిన్ననాటి నుంచి నేటివరకు ఏర్పాటు చేసిన ఫొటోలు ఆకట్టుకున్నాయి. హోంమంత్రి అనిత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగిన యనమల తూర్పుగోదావరి జిల్లాకు ఎంతో ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. రాజకీయాల్లో విలువైన వ్యూహకర్తగా పేరొందారని కొనియాడారు. అర్హత ఉన్న వారికి జరుగుతున్న సన్మానం అని పేర్కొన్నారు. యనమల సంస్కారం, సమర్థతతో ఎందరికో రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎన్టీఆర్‌కు యనమల ముద్దుబిడ్డగా మారారని, ఎందుకు యనమలను అంతగా ఇష్టపడ్డారో తెలియలేదన్నారు. 11సార్లు ఆర్థిక మంత్రిగా పనిచేయడం అరుదైన రికార్డు అని వివరించారు. మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, నారాయణ ప్రసంగిస్తూ యనమల నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఎంతోమంది ఎమ్మెల్యేలకు అనేక విషయాలు నేర్పినవారు రాజకీయంగా మరింత ఎదిగేలా సహకరించారని గుర్తుచేశారు. అనేక రాజకీయ సంక్షోభాలప్పుడు ఆయన్ను కలవడానికి వెళ్లినప్పుడు చిరునవ్వుతో ఒత్తిడి లేకుండా కనిపించడం ఆయనకు మాత్రమే సాధ్యమని వివరించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు తామంతా యనమల నుంచి ఎంతో నేర్చుకున్నామన్నారు. అవకాశాలు అందరికీ వస్తాయని, వాటిని అందిపుచ్చుకుని నిలబడడం యనమలకు మాత్రమే సాధ్యమన్నారు. యనమల, కింజరపు, గౌతు, ప్రతిభా భారతి తదితర కుటుంబాలు ఎప్పుడూ నారా కుటుంబానికి అంకితమన్నారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ యనమలకు కొడుకులు లేరని రాజకీయ వారసత్వం కనుమరుగు అయిపోతుందన్న ఆవేదన తనకు ఉండేదని, కానీ దివ్య రాకతో ఆ కొరత తీరిందని అన్నారు. రాజకీయాల్లో పదవులు లేకపోయినా క్రమశిక్షణగా ఉండాలని, పదవులు లేవని, అన్యాయం జరిగిందని అంటే ఎదగలేమని అన్నారు. యనమల ఎప్పుడూ టీడీపీకి గైడ్‌గా ఉండాలని కోరారు. యనమల సలహాలు పార్టీకి, నేతలకు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ యనమల రాజకీయాల్లో వటుడంతడిలా ఎదిగారన్నారు. ఆయనలో తాను ఎప్పుడు కోపం, ఆవేశం చూడలేదన్నారు. అందుకే తనకు యనమలను చూస్తే ఈర్ష్యగా ఉందని చమత్కరించారు. యనమల దేశస్థాయిలో మంచి పదవులోకి వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం తుని ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ తన తండ్రి గురించి మంత్రులు అందరూ గొప్పగా మాట్లాడడం చాలా సంతోషంగా ఉందని, ఆయన నుంచి ఇంతమంది నేతలు ఎన్నో నేర్చుకోవడం తనకు గర్వకారణంగా అనిపిస్తుందని అన్నారు. ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలను పక్కన కూర్చోబెట్టుకుని యనమల సలహాలు, సూచనలు ఇచ్చారని తాను ఎప్పుడైనా ఏదైనా అడిగితే పోయి పుస్తకం చదువుకో అనేవారని అని సరదాగా వ్యాఖ్యానించారు. అనంతరం ఎమ్మెల్యేలు బుచ్చిబాబు, ఆనందరావు, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, కాకినాడరూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. యనమల తెలుగుదేశం పార్టీకి అత్యంత విలువైన నేతగా కొనియాడారు. తామంతా కష్టసుఖాలు ఎప్పుడు యనమలతో పంచుకుంటూ ఆయన అనుభవాల నుంచి ఎన్నో నేర్చుకున్నామని గుర్తు చేశారు. సభా కార్యక్రమంలో ఆఖరిలో ప్రసంగించిన యనమల తన 42ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని నెమరు వేసుకున్నారు. చిన్న వయస్సులో ఎన్టీఆర్ టిక్కెట్ ఇచ్చి ప్రోత్సహించారని గుర్తు చేశారు. అనంతరం చంద్రబాబుతో కలిసి సుదీర్ఘంగా పని చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 38ఏళ్లు కేబినేట్ హోదాలో కొనసాగడం పార్టీ తనకు ఇచ్చిన గౌరవంగా భావిస్తానన్నారు. సభకు ఇంతమంది రావడం ఆనందం కలిగిస్తోందన్నారు. సభా కార్యక్రమంలో తొలుత యనమల ప్రస్థానంపై ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన అందరినీ అలరించింది. సభావేదికకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరై యనమలకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సభా కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కదులుదాం రండి మనం.. జన్మభూమికి.. గీతాన్ని ఆలపించి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిమంది కార్యకర్తలు, నాయకులు తరలిరాగా యనమల వారికి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.

## వ్యాపారి కిడ్నాప్ కలకలం

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కిడ్నాప్‌కు గురైన వ్యాపారి శిరగం మురళీహరసుబ్బారావు

రావులపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రావులపాలెంనకు చెందిన ఓ వ్యాపారి కిడ్నాప్ అయిన ఘటన కలకలం రేకెత్తించింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని ఆదిలక్ష్మీనగర్ ఐదో వీధిలో నివాసం ఉంటున్న శిరగం శ్రీరామ్(రమేష్) నాలుగు సంవత్సరాల క్రితం మహారాష్ట్రకు చెందిన సంజయ్ అనే వ్యక్తితో వ్యాపారంచేసి బాకీపడ్డాడు. బాకీ విషయమై వేధిస్తుండగా పెద్దలలో చర్చించుకున్నారు. ఇదిలావుండగా శ్రీరామ్ తండ్రి బుధవారంరాత్రి 12.30కు ఇంటికి ఫోన్‌చేసి పని ముగించుకుని వచ్చేస్తున్నట్లు తెలిపాడన్నారు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అతడి కోసం వెతుకుతుండగా మార్గమధ్యంలో గునిశెట్టి నాగేంద్ర ఇంటి సమీపంలో మురళీహర సుబ్బారావు మోటార్ సైకిల్, చెప్పులు, కళ్లజోడు ఉండటాన్ని కుమారుడు గుర్తించాడన్నారు. గురువారం ఉదయం తండ్రి కుమారుడికి ఫోన్‌చేసి సంజయ్ అతని కూడా వచ్చిన వారు బలవంతంగా కారులో ఎక్కించుకుని మహారాష్ట్రకు తీసుకుని వెళుతున్నట్లు తెలిపిన అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందన్నారు. దీంతో శ్రీరామ్ గంటికి చెందిన రుద్ర సురేష్ ద్వారా సంజయ్, రమేష్, గోపయ్య తదితరులు తన తండ్రిని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేవీ రమణారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రంప పీజీఆర్ఎస్ వేదికకు
## జడ్పీ సీఈవో నిరాకరణ

- వివాదాస్పదమవుతున్న జిల్లా, మండల పరిషత్ అధికారుల తీరు
- వైసీపీ ప్రజా ప్రతినిధులకు భవనాన్ని ఎలా ఇస్తారంటూ దేశం నేతల ఎద్దేవా

రంపచోడవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నన్న ప్రజా సమస్యల పరిష్కార(పి.జి.ఆర్.ఎస్) వేదికను అంతే ప్రతిష్ఠాత్మకంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించేందుకు మాత్రం అధికార యంత్రాంగం అడ్డుపడుతోంది. రంపచోడవరం నియోజకవర్గ స్థాయిలో రంపచడవరం కేంద్రంగా ఎమ్మెల్యే శిరీషదేవి రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్.వేదిక నిర్వహణ కోసం భవనాన్ని కేటాయించాలని కాకినాడలోని ఉమ్మడిజిల్లా పరిషత్ సీఈ వోను కోరారు. కాగా ఇందుకు ఆయన నిరాకరిస్తూ ఎమ్మెల్యేకు సమాచారాన్ని ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ కోసం ఖాళీగా ఉన్న భవనాన్ని అడిగితే అందుకు రంపచోడవరం ఎంపీడీవో సూచనలతో జిల్లా పరిషత్ సీఈవో నిరాకరించడం వివా దంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికే జిల్లా పరిషత్ సీఈవో అడ్డుతగలడంపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రజా కార్యక్రమం కోసం భవనాన్ని అడిగితే కార్యాలయం కోసం భవనం అడిగినట్టుగా ఎత్తిచూపి నిరాకరిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. తాము ప్రజా ప్రయోజన కార్యక్రమానికి అడిగితే వీలులేదని చెప్పిన అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో వైసీపీ ఎమ్మెల్సీకి, రంప చోడవరం జడ్పీటీసీ కార్యాలయాన్ని ఎలా కొనసాగింప చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై జిల్లా పరిషత్ సీఈవో, రంపచోడవరం ఎంపీడీవోలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసేందుకు కూడా ఇక్కడి నేతలు సిద్ధమవుతున్నారు.

## ట్రాక్టరు బోల్తా.. వ్యక్తి మృతి

సీతానగరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరు తిరగబడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రఘుదేవపురం ఇటుకబట్టీవద్ద చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు రఘుదేవపురం గ్రామానికి చెందిన ఇటుకబట్టీ యజమాని సిద్దే వెంకటేశ్వర్లు 45 గురువారం ఇటుకబట్టీ వద్ద ట్రాక్టరుతో మట్టి తొక్కుతుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టరు తిరగబడి మట్టిలో కూరుకుపోయాడు. ఇటుకబట్టీ వద్ద ఉన్న వారు ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టరును తొలగించి మట్టిలో కూరుకుపోయిన వెంకటేశ్వరరావును బయటకు తీయగా కొనఊపిరితో ఉన్న అతనిని చికిత్స నిమిత్తం హుటాహుటిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడికి భార్య దుర్గాభవాని వివాహమైన ఇద్దరు కుమార్తెలు కోటేశ్వరి, సంధ్యా రాణిలు ఉన్నారు. భార్య దుర్గా భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీను కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ట్రాక్టరు తిరగబడి మట్టిలో కూరుకుపోయిన వ్యక్తిని బయటకు తీసుకువచ్చిన దృశ్యం, మృతుడు సిద్దే వెంకటేశ్వర్లు







కాకినాడ తీరంలో వైమానిక విన్యాసాలు నిర్వహిస్తున్న యుద్ధ విమానాలు



శత్రువులపై దాడి చేస్తున్న ఆర్మీ సైనికులు

### అబ్బురపరచిన
## త్రివిధ దళాల విన్యాసాలు

- కాకినాడ సముద్ర తీరంలో టైగర్ ట్రయింఫ్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగరతీరంలో భారత్-అమెరికా దేశాలు సంయుక్తంగా మూడురోజులుగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్-2025 విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. గురువారం సముద్రజలాల్లో భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ జలశ్వ, ఆకాశంలో ఐఏఎఫ్ హక్స్ యుద్ధవిమానాలు, యూఎస్ఏకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ సిబ్బంది విన్యాసాల్లో పాల్గొన్నారు. యాంపీబీయస్ విన్యాసాల ఔటర్ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లను కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పా టిల్ ఆధ్వర్యంలో కాకినాడరూరల్ సీఐ డీఎస్ చైతన్యకృ ష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత పర్యవేక్షించారు.

## జనావాసాల్లోకి చుక్కల జింక

- అటవీప్రాంతంలో వదిలేసిన ఫారెస్ట్ అధికారులు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా రాజవొమ్మంగి మండలంలోని సూరంపాలెం గ్రామంలో గురువారం తెల్లవారుజామున సమీప అటవీ ప్రాంతం నుంచి చుక్కల జింక ఒక ఇంట్లోకి ప్రవేశించింది. దీంతో గ్రామస్తులు ఇంటి తలుపులువేసి స్థానిక ఫారెస్టు రేంజ్ అధికారిణి ఉషారాణికి సమాచారం అందించారు. దీంతో ఆమె సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో ఉన్న చుక్కలజింకను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాము, ఫారెస్టు సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.



ఇంటిలో బందించిన చుక్కల జింక

### నేడు ఉమ్మడి జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్ల సమన్వయ సమావేశం

కాకినాడసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఉమ్మడిజిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు, తహసీల్దార్ల సమన్వయ సమావేశం ఏర్పాటుచేసినట్టు ఏపీఆర్ఎస్ఏ కాకినాడజిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ కాకినాడజిల్లా చైర్మన్ పితాని త్రినాథ్ తెలిపారు. 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఇదే సమావేశ మందిరంలో ఏపీ జేఏసీ అమరావతి సభ్య సంఘాల ప్రతినిధులు, మహిళా విభాగం ప్రతినిధులతో సమావేశం, మధ్యాహ్నం 3గంటలకు క్లాస్-4 ఉద్యోగులు, డ్రైవర్ల సమస్యలపై సమావేశం నిర్వహిస్తామన్నారు.

### మహిళ మెడలో ఆభరణాల చోరీ

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 10( ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో 12గ్రాముల బంగారు ఆభరణాలు లాక్కెళ్లిన సంఘటన బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కె.ఆమని దివాన్‌చెరువు జీఎస్ఎల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తమ బంధువుల ఇంటికి దివాన్‌చెరువు వెళుతుండగా బొమ్మూరు రైస్‌మిల్లు సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమెపై దౌర్జన్యంగా మెడలో ఉన్న బంగారు వస్తువులు లాక్కొని పోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదెమ్మదిబ్బకు చెందిన టి.రాము (32) తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 7న రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతన్ని చూసిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరించారు. అయితే పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 15 నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం ఏపీ తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాంప్రదాయ పడవలు మినహాయించి, ఔట్ బోర్డ్, ఇన్ బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లతో ఈ 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

### స్థలం అమ్ముతామని నగదు తీసుకుని మోసం

- పోలీసులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన జి.సురేఖ ఆమె సోదరిలకు దివాన్ చెరువులో 500 గజాల స్థలం ఉందని చెప్పి దానిని విక్రయిస్తామని 2017లో రూ.50 లక్షలు తీసుకుని మోసం చేశారని హుకుంపేటకు చెందిన ఆకుమర్తి చిన్న అనే వ్యక్తి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తనను స్థలం విషయంలో మోసంచేసి డబ్బులు తీసుకున్న సురేఖ, ఆమె సోదరిలు ఇప్పుడు ఆ స్థలం అమ్మకపోగా తనను బెదిరరిరింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 21న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

### పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన ఓ మహిళను అదేప్రాంతానికి చెందిన సయ్యద్ రసూల్ అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని బాధిత మహిళ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో
## యువకుడి ఆత్మహత్య



మృతుడు శివన్నారాయణ

కొవ్వూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరికిరేవుల గ్రామానికి చెందిన మారిశెట్టి శివన్నారాయణ (24) గత కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. అనారోగ్యంతోపాటు, ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కూలి పనులకు వెళ్లిన తండ్రి సత్యనారాయణ ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్న కొడుకునిచూసి కన్నీటి పర్యంతం అయ్యాడు. మృతదేహాన్ని కిందకు దింపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### వడదెబ్బతో నాయీ బ్రాహ్మణుడు మృతి



మరణించిన లక్ష్మణరావు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాజా భజంత్రీలు వాయిస్తూ వడదెబ్బకు గురై కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరానికి చెందిన నాయీ బ్రా హ్మణుడు మరణించాడు. గ్రామానికి చెంది న సందిపర్తి లక్ష్మణరావు (50) దుర్గాదేవి ప్రతిష్ఠా కార్యక్రమంలో బాజా భజంత్రీలకు గురువారం వెళ్లాడు. భజంత్రీలు మోగిస్తుండగా ఎండ తీవ్రత తాళలేక వడదెబ్బ తగి లి కుప్పకూలిపోయాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 4.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ ఆ ధ్వర్యంలో పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడి చేశారు. 4.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని సరుకు యజమాని కర్రి లక్ష్మీనారాయణను అరెస్టు చేశారు. గొల్లప్రోలు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఉప్పాడలో రెండు టన్నుల బియ్యం స్వాధీనం

కొత్తపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి పోలీసులు గురువారం రాత్రి ఉప్పాడలో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గాంధీనగర్‌లో చిత్రాడ దొరబాబు వద్ద నిల్వ ఉంచిన ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### వయోజన విద్య సెంటర్ ప్రారంభం

రావులపాలెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రావుపాడులో వెజ్ స్వచ్ఛంద సేవా సంస్థ, లిటర్సీ ఇండియా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యం లో వయోజన విద్య సెంటర్‌ను ఏర్పాటుచేశారు. సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు ప్రారంభించారు.

### ఎంపీడీవోను అభినందించిన సర్పంచ్‌లు

అల్లవరం ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వర్క్‌ఫ్రం హోం సర్వేలో జిల్లాలో నూరుశాతం ప్రగతి సాధించినందుకు ఎంపీడీవోను, సిబ్బందిని పలువురు సర్పంచ్‌లు అభినందించారు. సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, సాధనాల వెంకట్రావు, తిక్కిరెడ్డి నాగ వెంకటశ్రీనివాస్, దాకారపు చిరంజీవి, చిట్నీడి శ్రీదేవిలు ఎంపీడీవో కృష్ణమోహన్‌ను అభినందించారు.

# సొంతింటి కల సాకారం చేయాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు



సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార జాతా దృశ్యం

ముమ్మిడివరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదలు నిర్మించుకునే ఇంటికి రూ.10లక్షలు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి పేదవాడి సొంత ఇంటి కల సాకారం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గురువారం సీపీఐ ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహించింది. తొలుత ప్రచారజాతా కార్యక్రమాన్ని శీలం వెంకటేష్, జనిపల్లి శివాజీ ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్ల స్థలాలు కేటాయిస్తున్నట్టు ప్రకటించడంతో చాలా మంది పేదలు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా వారందరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని సత్తిబాబు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులంతా పేదల సమస్యలను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముందు ఉంచాలన్నారు. సొంత ఇంటి స్థలం ఉన్నవారందరికీ ఇంటి నిర్మాణానికి సాయం అందించాలన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఎం.శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారని, ఆయన పేదల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి వారిపక్షాన నిలబడతారని ఆశాభావం వ్యక్తంచేశారు. వనచర్ల విజయ్‌కుమార్, కుమ్మరి వెంకటేశ్వరరావు, జగడం పాపాయమ్మ, సానబోయిన మనోహర్, పీఎస్ఎన్ రాజు, జి.వర్మ, మడికి మహాలక్ష్మి, దిగుమర్తి విజయ్, ఎం.మహేష్‌పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలి

## • ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్



అంబాజీపేట: పుల్లేటికుర్రులో భోజనం రుచిచూస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యులు కిరణ్

అంబాజీపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా నాణ్యతతో అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ సూచించారు. పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. భోజనం తయారుచేసే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కుళ్లిన కోడిగుడ్లు ఉంటే తక్షణమే వాటిని మార్పు చేసేందుకు హెచ్ఎంకు తెలియజేయాలన్నారు. అనంతరం స్టాక్‌పాయింట్ రికార్డులు, భోజన తయారు చేసే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. డీఈవో షేక్ సలీంబాషా, డీఎస్‌వో అడపా ఉదయ్‌భాస్కర్, సివిల్ సప్లయి మేనేజర్ బాలసరస్వతి, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, తూనికలు, కొలతల అధికారి రాజేష్, హెచ్ఎం కనకదుర్గ పాల్గొన్నారు. అనంతరం ముక్కామలలో రేషన్‌షాపులను ఆయన తనిఖీ చేశారు.

### నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్‌లో భోజనాలు మెనూ ప్రకారం అందించకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఫుడ్‌కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ హెచ్చరించారు. గురువారం నరేంద్రపురం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనం బాగాలేదని, చిక్కీలు ఇవ్వడం లేదని విద్యార్థులు వినతిపత్రాన్ని అందించారు. ముంగండ రేషన్‌షాపులో ఆయన తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సివిల్ సప్లయి అధికారుల, లీగల్ మెట్రాలజీ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

# మొండెపులంకలో డెంగ్యూ కేసు నమోదు

## 534 మందికి జ్వరపరీక్షలు



మొండెపులంకలో జ్వరపరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మొండెపులంక శివారుగిడుగువారిపాలెంలో డెంగ్యూ కేసు నమోదైంది. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది రెండు రోజులుగా గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల1న గిడుగువారిపాలానికి చెందిన ఓ వృద్ధురాలు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఈనెల8న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ నిర్ధారణ అయిందని వైద్యాధికారులు తెలిపారు. గురువారం జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు గ్రామాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 534మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని, వారిలో ఎవరికి జ్వరం, ఇతర సమస్యలు లేవన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించామన్నారు. పంచాయతీ సహకారంతో దోమల నిర్మూలనకు ఎబెట్ మందు పిచికారి, ఫాగింగ్ చేశామన్నారు. అనంతరం నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మలేరియా,ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర వ్యాధుల వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ వై.ప్రియాంక, డాక్టర్ మహ్మద్ రియాజ్ తున్నిషా బేగం, సబ్ యూ నిట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, ఎంపీహెచ్ఈవో ఎ.నాగరాజు, ఎంపీహెచ్ఎస్‌లు వీవీఎస్ఎన్ మూర్తి, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### ఓడలరేవు తీరంలో సాగర్ కవాచ్



ఓడలరేవు సాగర తీరంలో సాగర్ కవాచ్‌లో రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ బృందం

అల్లవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు సాగర తీరంలో సివిల్, మెరైన్ పోలీసుల సాగర్ కవాచ్ నిర్వహించారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అల్లవరం ఎస్ఐ టి.తిరుమలరావు, ఓడలరేవు మెరైన్ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, మెరైన్ ఎస్ఐలు చినబాబు, శ్రీనివాసరావుల పర్యవేక్షణలో సిబ్బంది గురువారం సాగర్ కవాచ్ నిర్వహించారు. సముద్ర తీరం వెంబడి బోట్ల ద్వారా ఉగ్రవాదులు చొరబడకుండా వారిని పట్టుకునే విన్యాసంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఓడలరేవు ఓఎన్జీసీ పాయింట్, మరిడమ్మ గుడి, వైనతేయ జెట్టీ పాయింట్లు, గాడిమొగ, వాసాలతిప్ప, కొత్తపాలెం లైట్‌హౌస్, ఎస్.యానం వేదాంత పాయింట్లలో సాగర్ కవాచ్ నిర్వహించారు.

### అంతర్వేదిలో..

అంతర్వేది, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది సముద తీరంలో రెండో రోజు గురువారం సివిల్, మెరైన్ పోలీసులు ఆధ్వర్యంలో సాగర్ కవాచ్ నిర్వహించారు. సీఐ అల్లు నవీన్‌నరసింహ ఆధ్వర్యంలో పలు బృందాలుగా ఏర్పడి అల్లవరం నుంచి అంతర్వేది మీదుగా పేరుపాలెం వరకు సాగర్ కవాచ్ నిర్వహించారు. సముద్ర మార్గం ద్వారా ముష్కరులు చొరబడితే వారిని ఎలా పట్టుకోవాలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు కె.దుర్గాశ్రీనివాస్, నాగరాజు, వీరాస్వామిరాజు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామనవమి ఉత్సవ ఊరేగింపు

అల్లవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అల్లవరంలో శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి పల్లకీతో పాటు బ్యాండు మేళాలతో జరిగిన ఉత్సవ ఊరేగింపులో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించండి



ముమ్మిడివరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులు ఉండడం వల్ల విద్యార్థులకు గుణాత్మక విద్య లభిస్తుందని, ప్రతీ ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని డాక్టర్ మోకా గణపతిరావు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రశాంతి సూచించారు. లక్ష్మీప్రశాంతి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతం, కొత్తలంక, రాణేలంక గ్రామాల్లో గురువారం అడ్మిషన్ల ప్రత్యేక డ్రైవ్‌నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా సంస్కరణల్లో భాగంగా ఏప్రిల్ 1నుంచి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తు న్నామన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లిక్యాంపెయినింగ్ నిర్వహించారు.

# గ్రామదేవత యల్లారమ్మకు లక్ష కుంకుమార్చన



ఉప్పలగుప్తం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి గ్రామ దేవత యల్లారమ్మ 117వ వార్షికోత్సవ పూజల్లో భాగంగా గురువారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం(నాని), కార్తికేయశర్మ ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి గౌరీశంఖర్ పర్యవేక్షణలో ఉదయం నుంచి రాత్రి వరకు పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సలాది వాసు మహిళలకు నూతన వస్త్రాలు బహూకరించారు. నాగిరెడ్డి వెంకటేశ్వరరావు బ్రదర్స్ అల్పాహారం, పానుగంటి వెంకట దత్తాజీరావు కుటుంబ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

# నేలకు పునరుజ్జీవం ఇచ్చే 'పీఎండీఎస్'



30రకాల విత్తనాల మిశ్రమ సంచులను రైతులకు అందిస్తున్న వ్యవసాయాధికారి కుమార్‌బాబు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పీఎండీఎస్ పథకం ద్వారా నేలకు పునరుజ్జీవం ఇవ్వడమే కాకుండా పశుగ్రాసం లభించి పాడి పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్ ఆధ్వర్యంలో గురువారం గొల్లవిల్లి అరిగెల వెంకటనరసింహారావు వ్యవసాయ ప్రాంగణంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 30రకాల విత్తనాల మిశ్రమంతో సాగు చేస్తే నేలతల్లి ఏవిధంగా బాగుపడుతుందో ఆయన వివరించారు. రుతుపవనాలకు ముందు లేదా మూడవ పంటగా ఈ విత్తనాలను చల్లుకుని ప్రయోజనం పొందాలని రైతులకు సూచించారు. రైతులకు విత్తనాల బ్యాగ్గులను పంపిణీ చేశారు. నీటి సంఘం చైర్మన్ నల్లా సత్యనారాయణ, తెలుగుదేశం మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, రైతులు అడబాల సత్యనారాయణ, గొలకోటి సత్తిరాజు, మద్దింశెట్టి సీతారామస్వామి, సలాది రామకృష్ణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు



ముంగండ తాగునీటి ప్రాజెక్టు వద్ద మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ముంగండ తాగునీటి ప్రాజెక్టు వద్ద రూ.25లక్షలతో ఏర్పాటుచేసిన మైక్రో ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. తాగునీరందని గ్రామాల్లో ట్యాంకుల ద్వారా నీరందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.రవీంద్రబాబు, జెఈ కల్యాణ చక్రవర్తి, సర్పంచ్ కుసుమ చంద్రకళ, ఎంపీటీసీలు అంబటి భూలక్ష్మి, పులపర్తి వెంకటలక్ష్మి, ఆదిమూలం సూరయ్యకాపు, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వీరవెంకట సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. నరేంద్రపురం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను జేఈ జీవీ ఆచార్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు.

### ప్రతీ నిరుపేదకు వైద్యసేవలు

పి.గన్నవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి నిరుపేద కుటుంబానికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. జనసేన క్యాంపు కార్యాలయంలో గురువారం 26మందికి రూ.17.32లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.1.50కోట్ల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించామన్నారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాద్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దాల సుబ్బారావు, వాసంశెట్టి కుమార్, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, చిట్టూరి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, తిక్కా సత్తిబాబు, శేరు శ్రీనుబాబు, గుత్తుల చంటి, కె.సత్యనారాయణ రాజు, పప్పుల సాయిబాబు, ఆదిమూలం సూరయ్యకాపు, తాటికాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కేశవస్వామి ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి నిత్యాపసన, బలిహరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి జాతర కన్నుల పండుగగా నిర్వహించారు.

### యూటీఎఫ్ నాయకుడు కృష్ణంరాజు మృతి

ఐ.పోలవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నాయకుడు పొత్తూరి కృష్ణంరాజు(74) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కేశనకుర్రుపాలెంకు చెందిన ఆయన యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షునిగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షునిగా సేవలందించారు. ఆయన మృతికి యూటీఎఫ్ మండల శాఖ సంతాపం తెలిపింది.

### గ్రామస్తుల డిమాండ్లు నెరవేర్చకుంటే తీవ్ర ఉద్యమం

#### క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు

అల్లవరం ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాభివృద్ధి, స్థానికయువతకు ఉపాధి వంటి గ్రామస్తుల న్యాయమైన డిమాండ్లపై ఓఎన్జీసీ అధికారులు స్పందించకుంటే గ్రామస్తుల సహకారంతో ఉద్యమం తీవ్రతరం చేస్తామని క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గురువారం 39వ రోజు గ్రామస్తులు ఓఎన్జీసీపై నిరసన దీక్ష చేశారు. రిలే దీక్షలో కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణ, నాతి లెనిన్‌బాబు, కలిగితి ఏసుబాబు, మందపాటి రామకృష్ణ, పినపోతు రామకృష్ణ, పెమ్మాని వెంకటరామారావు, మహిళలు పాల్గొన్నారు.

### 13న ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్

అమలాపురంరూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఈనెల13న జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ కన్వీనర్ వి.శ్రీనుబాబు తెలిపారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్, కోనసీమ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 13వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు ఈపోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు,మెడల్స్ అందజేస్తామన్నారు. ఈఅవకాశాన్ని చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ నంద్యాల మనువిహార్, ప్రిన్సిపాల్ దేవీదీక్షిత్‌లు కోరారు. వివరాలకు టోర్నమెంట్ కన్వీనర్ వి.శ్రీనుబాబు సెల్ 9704594846నుం సంప్రదించాలన్నారు.

### లఘు చిత్రాన్ని వీక్షించిన ఎమ్మెల్యే



లఘుచిత్రాన్ని వీక్షించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): లక్కవరానికి చెందినపవన్‌కల్యాణ్ అభిమాని మాదిరెడ్డి ఫణి నటించి నిర్మించిన హనుమాన్ లఘు చిత్రాన్ని లక్కవరం వేణుగోపాల థియేటర్‌లో గురువారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వీక్షించారు. అతి తక్కువ బడ్జెట్‌తో ఐఫోన్‌తో నిర్మించిన లఘుచిత్రంలో గ్రాఫిక్స్ ఆకట్టుకున్నాయన్నారు. ఫణితో పాటు మిగిలిన వారు కూడా బాగా నటించారన్నారు. మన ప్రాంతంలో చాలామంది ప్రతిభావంతులున్నారని, వారందరికీ నా ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దిరిశాల బాలాజీ, మంగెన నాని, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

### బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



కడలిలో పల్లెకుపోదాం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా

రాజోలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. కడలిలో పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు మంగళంపల్లి సుబ్రహ్మణ్యం స్వగృహం వద్ద గురువారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా తూర్పుపాలెంకాలనీ వాసుల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆదేశాల మేరకు బి.సావరంలో పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా రాజోలు మండలం బీజేపీ సెక్రటరీ చింతా ప్రసాద్, సర్పంచ్ కడియం రమాదేవి పర్యటించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యాలయం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. బీజేపీ సిద్ధాంతాలు, పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, వడ్లమూడి ప్రకాష్, కడియం పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### 13న కళారత్న దాట్లకు అభినందన సభ

యానాం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాం ఆధ్వర్యంలో ప్రముఖకవి దాట్ల దేవదానంరాజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డు అందుకున్న సందర్భంగా అభినందన సభ నిర్వహిస్తామని కవిసంధ్య సంపదాకులు డాక్టర్ శిఖామణి తెలిపారు. ఆదివారం సాయంత్రం 5.30గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశర హాలులో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరవుతారన్నారు. గౌరవ అతిథులుగా యానాం పరిపాలనాధికారి మునిస్వామి, డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, ఈలప్రోలు విష్ణువర్ధనరావు, మదునాపంతుల సత్యనారాయణమూర్తి, పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు హాజరుకానున్నారు. గతంలో కళారత్న అవార్డును 2017లో యానానికి చెందిన సీనియర్ కవి శిఖామణి అందుకున్నారు.

### పలు కాలనీల్లో హైవోల్టేజ్ సమస్య

#### • పాడైపోయిన గృహోపకరణాలు

యానాం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యానాంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా విద్యుత్ హైఓల్టేజీ రావడంతో పలు కాలనీల్లో గృహోపకరణాలు పాడైపోయాయి. కాకినాడ సమీపం నుంచి యానాం వచ్చే విద్యుత్ ఫీడర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో యానానికి గంటకుపైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ సమయంలో మెట్టకురు సమీపంలోని జీఎస్‌నాయుడు, నావాజ్ తదితర కాలనీల్లో విద్యుత్ హైఓల్టేజ్ రావడంతో చాలా ఇళ్లలో ఏసీ, ఫ్రిజ్, టీవీ, కంప్యూటర్స్, వాషింగ్‌మిషన్ తదితర గృహోపకరణాలు కాలిపోయాయి.

### కొబ్బరిలో అంతర పంటలతో అధిక ఆదాయం



పాశర్లపూడిలంకలో కొబ్బరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అంబాజీపేట శాస్త్రవేత్త

మామిడికుదురు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిలో అంతర పంటలు పండించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త చలపతిరావు పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలోని ఆదర్శ రైతు పెదమల్లు నాగబాబు వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కొబ్బరితోటల్లో నీటి ఎద్దడి రాకుండా కొబ్బరి ఆకులతో తోటలను కప్పుకోవాలని సూచించారు. కొబ్బరి రైతులకు దేశవాళీ, హైబ్రీడ్ కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు పరిశోధనా కేంద్రం వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని సూచించారు. హైబ్రీడ్ మొక్కు రూ.350, దేశవాలీ మొక్క రూ.100కు విక్రయిస్తున్నామన్నారు. ప్రతీ రైతు కొబ్బరిలో అంతర పంటలు పండించేలా ముందుకు సాగాలని కోరారు. ఆయనతో పాటు ఉద్యానవన శాస్త్రవేత్త కిరీటి ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన ఉప్పలగుప్తం, చల్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో 33,11కేవీ లైన్స్ ట్రీ ట్రిమ్మింగ్, నిర్వహణ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉప్పలగుప్తం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, చీకట్లపాలెం, పేరాయిచెరువు, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు, మునిపల్లి, సన్నవిల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, వానపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి, రామవులపేట గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. చల్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని చల్లపల్లి, గోపవరం, సరిపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, అల్లవరం మండలంలోని నక్కారామేశ్వరం గ్రామాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

**కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి):** లైన్ల మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఈకారణంగా మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** పి.గన్నవరం నుంచి అంబాజీపేట సబ్‌స్టేషన్‌కు వచ్చే 33 కేవీ విద్యుత్‌లైన్లకు, 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో అంబాజీపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వాకలగరువు ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కె.రాంబాబు తెలిపారు. వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు, గన్నేపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

### ప్రొటోకాల్ ఉల్లంఘనపై మహిళా సర్పంచ్ ఆవేదన

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విలసవిల్లిలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక పీహెచ్‌సీ ఉద్యోగి గ్రామంలో సీసీ రోడ్డు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమానికి తనను ఆహ్వానించకుండా స్థానిక ఎంపీటీసీ భర్త, పీహెచ్‌సీ ఉద్యోగి తానే ఎంపీటీసీగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా అధికారులు పట్టించుకోక పోవడం ఎంతవరకు సబబని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామంలో చేనేతకార్మికులకు సోలార్ సిస్టమ్ యూనిట్లు అందించే కార్యక్రమానికి తనను పిలిచి, అనంతరం కార్యక్రమం వాయిదా పడినట్టు చెప్పారన్నారు. మరుసటి రోజు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం జరిపించిన తీరు గ్రామప్రథమ పౌరురాలిని అవమానించడమేనన్నారు. పార్టీలకతీతంగా ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌కు కనీస గౌరవం ఇవ్వకుండా ఒక పీహెచ్‌సీ ఉద్యోగి పెత్తనం చెలాయించడాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

### నేడు మహాలక్ష్మి అమ్మవారి జాతర

అంబాజీపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాచవరంలో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతరను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి పండు, కార్యదర్శి గంగ్రోతు శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారి జాతరలో గరగనృత్యాలతో పాటు సినీఆర్కెస్ట్రా, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శనివారం ఆలయం వద్ద తీర్థం జరుగుతుందని తెలిపారు.

### పని దినాల పెంపు కోసం కృషి చేస్తా: ఎమ్మెల్యే

మలికిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికుల పనిదినాలను 100 నుంచి 120 రోజులకు పెంచడం కోసం ప్రభుత్వంతో మాట్లాడతానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మోరిలో మెండికోడు కాల్వ పనులు చేస్తున్న ఉపాధి హామీ సిబ్బందితో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీల్డు అసిస్టెంట్ శ్రీనివాస్ మహిళా మేట్లతో ఎమ్మెల్యే మాట్లాడారు.

### అంతర్వేదిపాలెంలో బడి బాట-బంగారు బాట

అంతర్వేది, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంమధ్య గ్రూపు మోడల్ ప్రైమరీ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థులనుబడిలో చేర్చుకునే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడిబాట-బంగారు బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్టు ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం తల్లికివందనం పేరుతో రూ.15వేలు ఆర్థికసాయంగా అందిస్తుందని, స్మార్ట్‌క్లాసురూములు ఏర్పాటుచేసి సుశిక్షితులైన ఉపాధ్యాయులతో విద్య అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈవోలు తెలిపారు.

### 'పేదల అవసరాల గుర్తించడానికే పల్లెకు పోదాం'

మామిడికుదురు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదవారి అవసరాలను గుర్తించడానికే బీజేపీ పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహిస్తుందని ఆ పార్టీ పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పల్లెకుపోదాం కార్యక్రమం మండలంలో గురువారం జరిగింది. కార్యక్రమంలో చీకురుమెల్లి మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలని కోరారు. మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ, నాయకులు మెండా వెంకటేశ్వరరావు, కంకిపాటి సుబ్బారావు, కుడుపూడి చంద్రశేఖర్, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, చిన్నీ, కుమార్ పాల్గొన్నారు.

### రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పలు స్కీముల ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ఎస్సీ సామాజికవర్గాల వారికి 40, 50, 60శాతం సబ్సిడీతో వివిధ యూనిట్ల మంజూరు, 35, 45, 55 శాతంపై బ్యాంకు రుణాలు, లబ్ధిదారుడు 5 శాతం కంట్రిబ్యూషన్ చెల్లించేలా రుణాలు మంజూరు చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు సచివాలయం లేదా నెట్ సెంటర్ల ద్వారా ఈనెల14 నుంచి మే10వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు**

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. గురువారం ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో అమలాపురం-బొబ్బర్లంక రహదారి నుంచి రజకులపేట ఏటిగట్టు మీదుగా రూ.50లక్షల ఎంపీ నిధులతో నిర్మిస్తున్న తారురోడ్డు, ఎస్సీ కాలనీ నుంచి పంచాయతీ వరకు నిర్మించనున్న రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచ్ జుజ్జవరపు శ్యామల ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, హరిబాబు పాల్గొన్నారు. లొల్ల రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజేశ్వరరావు, ఏవో మహేష్, సర్పంచ్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

# హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

**మాజీ ఎమ్మెల్యే బిక్కిన**



మాట్లాడుతున్న ఆలమూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి

మండపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) ప్రపంచ హోమియో దినోత్సవాన్ని మండపేటలో వున్న గౌతమి హోమియో కినిక్‌లో గురువారం నిర్వహించారు. హోమియో పితామహుడు క్రిస్టియన్ సామ్యూల్ హనిమాన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, హోమియో వైద్యుడు డాక్టర్ చల్లా రవికుమార్ నివాళు లర్పించారు. డాక్టర్ చల్లా రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు డాక్టర్ సి.రవికుమార్, చల్లా మోహర్ ప్రసన్న, నీరజ, రంజనీ, సూర్యచంద్ర హోమియో మార్కెటింగ్ డైరెక్టర్ సలాది దుర్గాప్రసాద్, మీరాబిసాహెబ్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కవులు, రచయితలు సమాజ హితానికి పాటుపడాలి

మండపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సమాజహితానికి పాటుపడాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్ అన్నారు. ద్వారపూడిలో గురువారం అభ్యుదయ రచయితల వార్షికోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా స్వామి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. విజయవాడలో 27న మాకినేని బసవ పున్నయ్య కేంద్రంలో గ్రంథాలయం పునర్వికాస సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రచయితలు, కవులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు తూలూరి నరేంద్ర, బండారు రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవి స్వామిప్రసాద్

# వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రావులపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రిమండలి, శాసనమండలి ఆమోదం తెలపడాన్ని వ్యతిరేకిస్తూ మాల మహానాడు జేఏసీ సమావేశం నిర్వహించారు. స్థానిక కొత్తకాలనీ రోడ్డులో ఉన్న ఒక గెస్ట్‌హౌస్ వద్ద కె.శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జేఏసీ నాయకులు డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, జంగా బాబురావు, నెల్లి లక్ష్మిపతితో పాటు ముఖ్య నాయకులు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కోనాల రాజు, గాడి కిష్టఫర్, కుసుమే ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




రామచంద్రపురంలో డిపో ముందు ధర్నా చేస్తున్న ఉద్యోగులు

# సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల గేట్ మీటింగ్, ధర్నాలో భాగంగా గురువారం ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేశారు. ఎస్‌ఎం యూపీ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, గ్యారేజీ సమస్యలు పరిష్కరించాలని, అమలాపురం డిపో డ్రైవర్ బీఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ వీ రావు, కార్యదర్శి బండి ముత్యాలరావు, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సంఘం కాలనీ ఎంపీపీ పాఠశాలలో గ్రాడ్యుయేట్ డే

మండపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండపేట సంఘం కాలనీలో వున్న మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేట్ డే నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మాణిక్యాంబ సారథ్యంలో ఉపాధ్యాయుడు చిట్టూరి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మండల విద్యాధికారి ఎస్. రామచంద్రరావు హాజరయ్యారు. విలువలతో కూడిన విద్యతోపాటు విద్యార్థుల్లో చైతన్యం తీసుకువస్తున్న ఉపాధ్యాయులను ఎంఈవో అభినందించారు. తమ చిన్నారులు గ్రాడ్యుయేట్ డ్రెస్‌లో కనిపించగానే వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. విద్యార్థులకు ఎంఈవో సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నారాయణరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ డేలో పాల్గొన్న విద్యార్థులతో ఎంఈవో తదితరులు

# వ్యాన్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురానికి చెందిన సిద్ధనాతి పవన్ సాయికుమార్ కుటుంబానికి రూ1,16,147 ఆర్థికసాయాన్ని వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ గురువారం అందచేశారు. గతనెల 24న టాటా మ్యాజిక్ వ్యాన్ డ్రైవర్ పవన్‌సాయికుమార్ మృతి చెందాడు. దీంతో లక్ష్మీగణపతి టాటా మ్యాజిక్ యూనియన్ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు ఆల్ ఆంధ్ర మ్యాజిక్ వాట్సప్ గ్రూపు అడ్మిన్లకు తెలిపారు. దీంతో కొయ్యలగూడెం అడ్మిన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు రూ.1,16,147 సేకరించారు. గురువారం రామచంద్రపురం వెహికల్ ఇన్‌స్పెక్టర్ వారి కుటుంబానికి అందచేశారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల అడ్మిన్లు కొండబాబు, వెంకటేష్, వరప్రసాద్,వాలిశెట్టి శ్రీను, వాసంశెట్టి శ్రీను, సురేష్, చక్రం, శేఖర్, లక్ష్మీగణపతి యూనియన్ అధ్యక్షుడు సూరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వ్యాన్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం అందచేస్తున్న ఎంవీఐ రాజేంద్రప్రసాద్

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



### నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలుపుదల

కొత్తపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలో 33, 11కేవీ జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాంబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# చెత్త ఇలా ఉంటే...రోగాలు రావా?

• పంచాయతీల్లో కంపోస్టుయార్డులకు స్థలం కరువు • మురుగుకాల్వలు, రోడ్లు, చెరువులే దిక్కు

మండపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో వచ్చే చెత్తను వేసేందుకు స్థలాల్లేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒకపక్క ప్రభుత్వం తడిపొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి సంపద కేంద్రాల ద్వారా ఆదాయం పొందాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలతో పంచాయతీ కార్యర్శులకు ఏం చేయాలో తెలియటం లేదు. స్థలాల కొరత నేపథ్యంలో గ్రామాల్లో వచ్చే చెత్తను మురుగు కాల్వలు, చెరువులు, ఖాళీ స్థలాలు, రోడ్డుపక్క పడేస్తున్నారు. తదనంతరం వేసిన చెత్తకు నిప్పుపెట్టి తగలబెడుతున్నారు. మండపేటలో వున్న 12 పంచాయతీల్లో ఏడిద, ద్వారపూడి మినహా మరెక్కడా కంపోస్టు యార్డుకు చెత్తవేసే స్థలాల్లేవు. దీంతో ఆయా పంచాయతీల్లో చెత్తను రోడ్డుపక్క వేస్తున్నారు.





కేశవరంలో చెరువుగట్టు వద్ద పేరుకుపోయిన చెత్త. పక్కన చిత్రంలో ఇప్పనపాడు చెత్తను తుల్యభాగ డ్రైన్‌గట్టుపై పడేసిన దృశ్యం

దీంతో మురుగుకాల్వలు, చెరువులు వాటివల్ల మూసుకుపోయి మురుగునీరు దిగేదారిలేక ఇబ్బందులు కలుగుతున్నాయి. మరోవైపు వాటి వల్ల ఎక్కడ రోగాలు వస్తాయోనని ఆయా ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. డంపింగ్ యార్డుకు స్థలాలు ఏర్పాటు చేసి, వాతావరణం కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. వాటి నుంచి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



విద్యార్థినికి నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యం తదితరులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని టీడీపీ సీనియర్ నాయకుడు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.వీరన్న, పూర్వ విద్యార్థులు మేడిశెట్టి శేషారావు, కంచుమర్తి బాబూరావు, సిరిగినీడి దుర్గాప్రసాద్, లైబ్రేరియన్ ఎన్.చక్రధర్, పీడీ జంపని రఘురామ్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

**నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రధాన ధ్యేయం:** నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మంత్రి సుభాష్ ధ్యేయమని సత్యం ఫౌండేషన్ చైర్మన్ సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురం వీఎస్‌ఎం కళాశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్ హెచ్‌ఆర్ వీఎస్ఎస్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్వ్యూలు పూర్తి చేశామని త్వరలో నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కంపెనీ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ తదితరులతో పాటు నిరుద్యోగులు పాల్గొన్నారు.

**పీఎంఏజే అభ్యుదయ యోజన చెక్కులు అందచేత:** ప్రధానమంత్రి అనుసుచిత్ జాతీయ అభ్యుదయ యోజన పథకంలో ఎస్సీ కార్పొరేషన్ చెక్కులను సత్యం ఫౌండేషన్ చైర్మన్ వారికి అందచేశారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కె.గంగవరం, రామచంద్రపురం మండలాలకు చెందిన 8 మందికి రూ.12 లక్షల చెక్కులను ఆయన అందచేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం అర్జున్, రామచంద్రపురం, కె.గంగవరం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సూర్యకుమారి, గుత్తుల దుర్గాదేవి, వీవోఏలు పాల్గొన్నారు.

### నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

కె.గంగవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం పామర్రు జూనియర్ కళాశాల ఆవరణలో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సంధ్యా ఆక్వా హెచ్‌ఆర్ సుబ్బారావు మాట్లాడారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగుల నుంచి దరకాస్తులు తీసుకున్నారు. అభ్యర్థులకు ఫోన్ చేసి తేదీలు వివరిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రశేఖర్, కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, మేడిశెట్టి శేషారావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఎనుముల గోపాలకృష్ణ(చిట్టిబాబు), పలు గ్రామాల నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

### కేశవమాలధారులు పాదయాత్ర

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా ఐదవ రోజు గురువారం స్వామివారికి సహస్రనామార్చన, నిత్యోపాసన, బలిహరణ, వేదపారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు సూర్యానారాయణచార్యులు బ్రహ్మత్వంలో సదస్యం నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భరత నాట్య నృత ప్రదర్శన అలరించింది. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు నిర్వహించారు.



అంకంపాలెంలో ఆయిల్‌ఫామ్ సేద్యంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

### ఆయిల్ ఫామ్ సేద్యం చేపట్టాలి

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం అంకంపాలెం, ర్యాలి, మెర్లపాలెంలో సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ సాగు చేయండి రారాజులు అవ్వండి నినాదాలతో ప్రచారం నిర్వహించారు. వీధుల్లో సాగిన ఈ ప్రచారంలో ఆయన ఫామ్ సేద్యం ప్రతి ఇంట సౌభాగ్యమంటూ సాగు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో జీఎం ప్రభాకరరావు, ఏజీఎం వీరభద్రరావు, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): లొల్ల భవిత కేంద్రంలో గురువారం పారా సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల కోఆర్డినేటర్ బడుగు మహిమారావు ఆధ్వర్యంలో ప్రతిభావంతుల పిల్లల తల్లిదండ్రులకు పిల్లలను ఏ విధంగా చూడాలో తెలియచేశారు. అనంతరం పిల్లలను ప్రోత్సహించే విధానంపై తల్లిదండ్రులకు వివరించారు. ఎంపీడీవో రామన్ దివ్యాంగుల పిల్లల విషయంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామన్నారు. పారా సంస్థ డైరెక్టర్ థామస్ బలిదానం, బడుగు సుబ్బాయమ్మ కిట్లను అందచేశారు. కార్యక్ర మంలో ఎంఈవో సాహెబ్, ఐఈఆర్టీ టీచర్లు అరుణ, జానకి, పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



సాయితేజ స్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి, నటుడు గౌతమ్‌రాజు తదితరులు

రాయవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని హాస్యనటుడు గౌతమ్ రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. రాయవరం సాయితేజ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అకడమిక్ డైరెక్టర్లు కర్రి భానురేఖా, సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం సినీ నటుడు గౌతమ్‌రాజు మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ఈసందర్భంగా చదువు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు వారు బహుమతులు అందజేశారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి పాటలకు అనుగుణంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో రచయిత పైడిపాల, డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, ఎంఈవో వై.సూర్యనారాయణ, ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సత్తి బుల్లి స్వామిరెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ



కూర్మాపురంలో రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేస్తున్న ఏవో తదితరులు

రాయవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రైతులు రెండు పంటలు పండించిన తరువాత భూమిని ఖాళీగా వదిలేయవద్దని వ్యవసాయ మండల అధికారి కె.ప్రభాకర్ అన్నారు. ఖాళీగా వదిలేయడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు నశించిపోవడం ద్వారా భూసారం తగ్గుతుందన్నారు. గురువారం మండలంలోని కూర్మాపురం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు రెండో పంట కోత కోయడానికి వారం రోజులు ముందుగా పీఎండీఎస్ కిట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ముప్పై రకాల విత్తనాలతో చేసిన పీడీఎంఎస్ కిట్లు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటి వినియోగదార్ల సంఘం డైరెక్టర్ కొరిపిల్ల శ్రీనివాసరావు, ముత్యాల చంద్రశేఖర్, జానకి రామయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.



పూర్తయిన కైలాసభూమి నిర్మాణం

### పూర్తయిన కైలాసభూమి

కొత్తపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కైలాసభూమి ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పూర్తి అయ్యింది. పారిశ్రామికవేత్త ఆర్యవైశ్య నాయకుడు నంబూరి రెడ్డియ్య సారథ్యంలో దీని నిర్మాణానికి అంకుర్పారణ జరిగినప్పటికి నిధులు లేమితో నత్తనడకన సాగింది. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ సహకారంతో మౌలిక సౌకర్యాల కల్పనకు సుమారు రూ.70లక్షలు మంజూరు చేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ప్రారంభానికి ఎదురు చూస్తున్న కైలాస భూమి నిర్మాణం పూర్తవగా శనివారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం కైలాస భూమిని దాతలు, కూటమి నేతలు సందర్శించారు.

### విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

కొత్తపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ ఆదేశించారు. గురువారం మండల పరిధి గొలకోటివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. గ్యాస్‌పొయ్యిపై వంటచేయాలని, వంటగదిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఎస్‌వో ఉదయభాస్కర్, డీఈవో ఎస్‌కే షలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

### బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం రాజవరం గోదావరి లంకలో 1100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కాత్యాయని తెలిపారు. వెలిచేరులో వీరమళ్ళ వెంకట సత్యనారాయణ వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఆమె తెలిపారు. ఈ దాడుల్లో ఎఈఎస్ అమర్‌బాబు, ఎస్ఐ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

### పాదచారులకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగం

ఆత్రేయపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఏర్పాటు చేసే చలివేంద్రాలు పాదచారులకు ఎంతో ఉపయోగపడతాయని వక్తలన్నారు. వెలిచేరుకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు నాగిరెడ్డి దుర్గాప్రసాద్, కొప్పుల శ్రీను తమ గ్రామమైన వెలిచేరులో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చలివేంద్రాన్ని ప్రారంభించి వారి సేవలను కొనియాడారు.

### అన్నసమారాధన

రావులపాలెం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మునలిరామాలయం ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామనవమి ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు దీన్ని నిర్వహించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంగర సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్‌శాఖ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. కపిలేశ్వరపురం ఫీడర్‌లోని లైన్లపై చెట్టుకొమ్మలు తొలగించడం, మరమ్మతుల కారణంగా కపిలేశ్వరపురం, వెదురుమూడి, పడమరఖండ్రిక గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన కోరారు.

**తాపేశ్వరం పరిధిలో..**

మండపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం పరిధిలోగల ఇప్పనపాడు, అర్తమూరులో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ డీఈ కె.రత్నాలరావు తెలిపారు. తాపేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోగల ఇప్పనపాడు, అర్తమూరు గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**పసలపూడి సబ్‌స్టేషన్ పరిధిలో..**

రాయవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు వల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల పసలపూడి, ఎర్రమట్టిపురం, నరాలవారి పాలెం, చెల్లూరు, రామచంద్రపురం కాలనీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

**శివల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

కె.గంగవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈ కె.రత్నాలరావు, కె.గంగవరం ఏఈ భాస్కర కుమార్ తెలిపారు. శివల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగించే పనులు జరుగుతాయని తెలిపారు. దీనివల్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. దీనివల్ల శివల, అద్దంపల్లి, వత్రపూడి, బాలాంత్రం, గుడిగళ్లభాగ, యర్రపోతవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న సుందర్‌కుమార్ దంపతులు

### భీమేశ్వరాలయంలో దేవదాయశాఖ విశ్రాంత కమిషనర్ పూజలు

ద్రాక్షారామ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని దేవదాయశాఖ విశ్రాంత కమిషనరు సుందర్‌కుమార్ గురువారం సతీ సమేతంగా దర్శించారు. భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని వారికి స్వామివారి ప్రసాదం అందచేశారు.



ఆలయం వద్ద రాట ముహూర్తం చేస్తున్న శ్రీను తదితరులు

### వెంకటేశ్వరస్వామి కల్యాణానికి రాట ముహూర్తం

కె.గంగవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు వచ్చేనెల 6 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు రేవు శ్రీను తెలిపారు. గురువారం ఆలయం వద్ద ఆయన కమిటీ సభ్యులతో కలసి ఉదయం 8.46 గంటలకు రాట ముహూర్తం చేశారు. నేటి నుంచి కల్యాణోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెమ్మాడి సత్తిబాబు, అయినవిల్లి సూరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.